
సాక్షి ఒడిశా

మంగళవారం । 23 । జనవరి । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,31,222లు, బంగారం 150 మిల్లీగ్రాములు, వెండి 19గ్రాములు 500 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



ప్రదర్శనలు అదరహో..!

నాటక ప్రదర్శనలు అదరహో అనిపిస్తున్నాయి. రెండో రోజు కూడా కళాకారులు అద్భుత ప్రదర్శనలతో అలరించారు.

- 10లో





17 మంది కలెక్టర్ల బదిలీ

రాష్ట్రంలో భారీ స్థాయిలో ఐఏఎస్ అధికారులు బదిలీ అయ్యారు. ఎన్నికల నేపథ్యంలో ఈ బదిలీలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

- 10లో

న్యూస్‌రీల్

డాక్టర్ సెల్వరాజ్ మృతికి సంతాపం



రాయగడ: రాయగడ అటానమస్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్, పర్మినెంట్ లోక్ అదాలత్ సభ్యుడు డాక్టర్ డి.సెల్వరాజ్(70) ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. కొద్దిరోజులుగా అస్వస్థతతో బాధపడుతున్న ఆయన భువనేశ్వర్‌లోని ఒక ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తుదిశ్వాస విడిచారు. ఈయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. స్వచ్ఛంద సంస్థల్లో సభ్యునిగా ఉంటూ అనేక మంది పేదలకు వైద్యసేవలందించారు. సెల్వరాజ్ మృతి వట్ల సమాజసేవకులు సంతావం వ్యక్తం చేశారు.

భారీ అలుగు స్వాధీనం



అలుగు, నిందితుడితో అటవీ సిబ్బంది

కొరాపుట్ : అరుదైన జంతువు భారీ అలుగును నబరంగ్‌పూర్ అటవీ శాఖ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. సోమవారం నబరంగ్‌పూర్ జిల్లా నందాహండి సమితి బి.మాలిగుడ గ్రామంలో అలుగు అక్రమంగా విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు అటవీ సిబ్బంది దాడులు చేపట్టారు. కొరాపుట్ జిల్లా కెందుగుడ గ్రామానికి చెందిన అరుణ ముదలి వద్ద అలుగును గుర్తించారు. దీనిని కొనుగోలు చేయడానికి వచ్చిన మరో వ్యక్తి పరారయ్యాడు. అలుగు బరువు 10 కేజీలు ఉండగా, రూ.15 లక్షలకు విక్రయించడానికి ప్రయత్నం చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. వారం రోజుల వ్యవధిలో అలుగు పట్టుబడటం రెండోసారి.

309 కిలోల గంజాయి సీజ్

బరంపురం : గంజాం, కొంధమాల్ జిల్లాల్లో రెండు వాహనాల్లో తరలిపోతున్న 309 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఏఎస్పీ ఠాగూర్ ప్రసాద్ పాత్రో అందించిన సమాచారం ప్రకారం.. దిగపండి నుంచి బరంపురం వైపు వస్తున్న వ్యాన్‌లో అక్రమంగా గంజాయి రవాణా అవుతున్నట్లు తెలియడంతో సురడా పోలీసులు హింజికాట్-దిగపండి-బరంపురం మధ్య నిఘాపెట్టారు. ఫస్ట్‌గేట్ సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద అధికారులు దాడులు చేసి 11 బస్తాల్లో 250 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా, కొంధమాల్ జిల్లా పిరింగియా పోలీసులు బంజనగర్ వైపు వస్తున్న ప్రైవేట్ బస్సును తనిఖీ చేయగా ఏడు బస్తాల్లో 59 కిలోల గంజాయి గుర్తించారు.

స్టేషన్‌మాస్టర్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌పై వేటు

- బహనాగ రైలు దుర్ఘటనలో రైల్వేశాఖ చర్యలు

భువనేశ్వర్: గత ఏడాది జరిగిన మూడు రైళ్ల ప్రమాదంలో బాలాసోర్ జిల్లా బహనాగా బజార్ స్టేషన్ మాస్టర్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌లను రైల్వే శాఖ ఉద్యోగం నుంచి తొలగించినట్లు సమాచారం. 2023 జూన్ 2న జరిగిన ఈ ఘోర దుర్ఘటనలో 294 మంది మరణించగా 1,200 మందికి పైగా గాయపడిన విషయం తెలిసిందే. ఈ రైలు ప్రమాదంలో ఆగ్నేయ రైల్వే (ఎస్ఈ) తొలి దశలో ఏడుగురు సిబ్బందిని సస్పెండ్ చేశారు. వీరిలో బహనాగా స్టేషన్‌మాస్టర్ ఎస్.బి.మహంతి, మండల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎ.కె.ఖుంటియాని ఉద్యోగం నుంచి తొలగించారు. దేశంలోనే దారుణమైన రైలు దుర్ఘటనగా అప్పట్లో తీవ్ర కలకలం రేపింది. ప్రాథమిక దర్యాప్తు ఆధారంగా సస్పెండైన ఉద్యోగుల్లో ముగ్గురిని సీబీఐ అరెస్టు చేసింది. వీరిలో సీనియర్ సిగ్నలింగ్ సెక్షన్ ఇంజినీర్లు అరుణ్ కుమార్ మొహంతా, మహ్మద్ అమీర్ ఖాన్, టెక్నీషియన్ పప్పూ కుమార్ ఉన్నారు. సస్పెండైన ఇతర నలుగురు ఉద్యోగుల్లో సిగ్నల్ టెక్నీషియన్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, అసిస్టెంట్ డివిజనల్ సిగ్నల్, టెలికమ్యూనికేషన్ ఇంజినీర్ నిర్లక్ష్యం ప్రమాదానికి దారితీసిందని విచారణ నివేదిక వెల్లడించింది.

రైల్వేబోర్డు సిఫారసు మేరకు..

గత ఏడాది జూన్ 2న రాత్రి రెండు సూపర్ ఫాస్ట్ రైళ్లు షాలిమార్ - చెన్నై కోరమాండల్ ఎక్స్‌ప్రెస్, బెంగళూరు - హౌరా ఎక్స్‌ప్రెస్, గూడ్స్ రైలు అరుదైన పరిస్థితుల్లో ఢీకొనడంతో ఈ ప్రమాదం సంభవించింది. ప్రమాదానికి గల కారణాలపై అనేక విశ్లేషణలు వెలువడిన తర్వాత రైల్వే బోర్డు సిఫారసు మేరకు సీబీఐ ప్రభుత్వ రైల్వే పోలీసు (జీఆర్‌పీ) ద్వారా దర్యాప్తు చేపట్టింది. సిగ్నల్, టెలికమ్యూనికేషన్ విభాగంలో వివిధ స్థాయిల్లో 'లోపాలు' ప్రమాదానికి కారణమని రైల్వే భద్రత కమిషనర్ నివేదిక పేర్కొంది. స్టేషన్ మాస్టర్ తప్పిదంతో క్రాస్ ఓవర్ పాయింట్ వద్ద సిగ్నల్స్ పునరావృతమైన అసాధారణ పరిస్థితి అనివార్యమైంది. దీంతో దక్షిణం వైపున వెళ్లాల్సిన షాలిమార్ - చెన్నై కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ పొరపాటున లూప్‌లైన్‌లోకి ప్రవేశించింది. ఆ లైనులో అప్పటికే ఉన్న గూడ్స్ రైలుని ఢీకొట్టింది. ఈ తీవ్రతతో ఆవలి వైపు పట్టాలపై కదులుతున్న బెంగళూరు - హౌరా ఎక్స్‌ప్రెస్ ఎక్స్‌ప్రెస్ రైలు సైతం ప్రమాదానికి గురైంది.



బరంపురం: నగరంలో శ్రీరాముని ఉత్సవ విగ్రహాలతో ఊరేగింపు



పర్లాకిమిడి: పర్లాకిమిడి ప్యాలెస్ వీధిలో శ్రీరాముని ఊరేగింపు ఉత్సవం



భువనేశ్వర్: బాలరాముని ప్రతిష్ఠ ప్రత్యక్ష ప్రసారం వీక్షిస్తున్న సీం నవీన్ పట్నాయక్

జయజయరామ.. జగదభిరామ

- పులకించిన భక్తజనం
- ఒడిశా వ్యాప్తంగా మార్మోగిన రామనామం
- పురవీధుల్లో శ్రీరాముని చిత్రపటాలతో ఊరేగింపు ఉత్సవం

చిరకాల స్వప్నం సాకారమైంది. అయోధ్య రామమందిర ప్రారంభోత్సవ కళ నెరవేరింది. ఈ నందర్భంగాద ఒడిశా వ్యాప్తంగా రామనామ స్మరణ హోరెత్తింది. శ్రీరాముని చిత్రపటాలతో ఊరేగింపు, ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అన్న సమారాధనలతో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సోమవారం రాజధానిలోని తన నివాసంలో అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి ఆలయంలో ప్రాణ ప్రతిష్ఠ ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భగవత్ ఇతర ప్రముఖుల సమక్షంలో దాదాపు ఒక గంటసేపు జరిగిన ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం ముఖ్యమంత్రి ఆద్యంతాలు తిలకించారు. అయోధ్యలో రామాలయం ప్రాణప్రతిష్ఠ మహోత్సవం పురస్కరించుకుని రాష్ట్ర గవర్నరు రఘుబర్ దాస్ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. శ్రీరాముని ఆశీస్సులతో అందరూ వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

–భువనేశ్వర్/జయపురం/రాయగడ/ పర్లాకిమిడి/బరంపురం/కొరాపుట్





జయపురం: శ్రీరామ రథం ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు



రాయగడ: లవకుశల వేషధారణలో చిన్నారులు



రాయగడ: కోదండ రామాలయంలో సీతారామ లక్ష్మణులు



జయపురం: నట్టిడొంగర పర్వతంపై స్తంభానికి జెండా కడుతున్న భక్తుడు



జయపురం: ఇంటి ముందు రాముడి ముగ్గు వేస్తున్న మహిళలు



జయపురం: జమాల్ లైన్ సీతారామాంజనేయ ఆలయంలో నృత్యం చేస్తున్న యువతి



బరంపురం: ప్రేమనగర్ అపార్ట్‌మెంట్‌లో హనుమాన్ చాలిసా పూజలు



పర్లాకిమిడి:పర్లాకిమిడిలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ర్యాలీ



కొరాపుట్: నబరంగ్‌పూర్ కన్యాకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు



కొరాపుట్:నబరంగ్‌పూర్ మెయిన్ రోడ్డులో హిందూ కార్యకర్తల నినాదాలు



జయపురం: భజన చేస్తున్న భక్తులు



పర్లాకిమిడి: పూజలందుకుంటున్న బాలరాముడు



జయపురం: శ్రీరాముడు, ఆంజనేయ, లక్ష్మణ వేషాలలో చిన్నారులు



పర్లాకిమిడి: కాశీనగర్‌లో ఊరేగింపులో ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు



పర్లాకిమిడి: జగన్నాథ మందిరంలో యజ్ఞం నిర్వహిస్తున్న అర్చకులు



రాయగడ: జెండాలతో కళింగవైశ్య సంఘం మహిళలు

పూరీకి అర్పణ్ రథం సేకరణలు



విరాళాల సేకరణలో అర్పణ రథం

భువనేశ్వర్ :

శ్రీమందిరం వారసత్వ ప్రాకార పథకం అర్పణ్ రథం సేకరణలు పూరీ చేరనున్నాయి. ఈ రథం రాష్ట్రం అంతటా పర్యటించి వరి, వక్క, శ్రీఫలం, విరాళాలు సేకరించింది. వీటన్నింటినీ పూరీ చేర్చేందుకు సన్నాహాలు చేస్తున్నామని శ్రీ మందిరం ప్రధాన పాలన అధికారి రంజన్‌కుమార్‌దాస్ సోమవారం తెలిపారు. శ్రీమందిరం కార్యాలయంలో ప్రత్యేక విరాళాల సెల్‌ను ప్రారంభించామని చెప్పారు. నాలుగు కౌంటర్లు తెరిచామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు రూ. 2 కోట్లకు పైగా విరాళాలు పొందినట్లు అంచనా వేస్తున్నామన్నారు. ఈ మొత్తం శ్రీ మందిరం పొదుపు ఖాతాలో జమ చేస్తామని తెలిపారు. ఈ నెల 25 నుంచి అర్పణ్ రథం సేకరణలు పూరీ చేరనున్నాయని చెప్పారు. ఇక్కడికి వచ్చిన తర్వాత సామగ్రి ఎక్కడ ఉంచాలనే విషయంపై నిర్ణయం తీసుకుంటామని సీఏఓ తెలిపారు.

భక్తుల పట్ల స్నేహశైలి..

ఆలయ దర్శనానికి వచ్చే భక్తుల పట్ల సేవాయత్‌లు స్నేహశైలితో వ్యవహరించాలని శ్రీమందిరం అధికార యంత్రాంగం సూచించింది. ఈ మేరకు శ్రీమందిర్ కమాండర్, సూపర్‌వైజర్ ఛొతీషా నియోగ్ ప్రముఖులకు లేఖ జారీ చేశారు. భక్తుల పట్ల ప్రవర్తన, పదజాలం ప్రయోగం నేపథ్యంలో ఆలయ నిర్వాహకులు, అటెండర్లు, జగన్నాథ ఆలయ పోలీసులు (జేటీపీ), ఇతర సిబ్బందికి ప్రత్యేకంగా సూచనలు అందించారు.

14 ప్రతిపాదనలకు మంత్రి మండలి ఆమోదం

- రాష్ట్రంలో తొలి విద్యుత్ వాహన తయారీ ప్రాజెక్ట్
- వివరాలు వెల్లడించిన మంత్రి అశోక్‌చంద్ర, సీఎస్ ప్రదీప్‌కుమార్



వివరాలు వెల్లడిస్తున్న మంత్రి, చీఫ్ సెక్రటరీ

భువనేశ్వర్ :

ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అధ్యక్షతన స్థానిక లోక్‌సేవా భవన్ 3వ అంతస్తు సమావేశ మందిరంలో 70వ మంత్రి మండలి సమావేశం సోమవారం నిర్వహించారు. 12 శాఖలకు సంబంధించిన 15 ప్రతిపాదనల్లో 14 ప్రతిపాదనల్ని మంత్రి మండలి ఆమోదించింది. మరో ప్రతిపాదనపై చర్చించిన మేరకు తదుపరి నిర్ణయం ప్రకటిస్తారు. రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరి ప్రదీప్‌కుమార్ జెనా, మంత్రి అశోక్ చంద్ర పండా మంత్రి మండలి తీర్మానాల్ని మీడియాకు సంక్షిప్తంగా వివరించారు. సమావేశంలో రెవెన్యూ-విపత్తు నిర్వహణ, అటవీ పర్యావరణ-వాతావరణ మార్పుల శాఖ అదనపు ముఖ్య కార్యదర్శి సత్యబ్రత్ సాహు, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హేమంత్ శర్మ, మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైన్యూర్ శాఖ కార్యదర్శి శాశ్వత్ మిశ్రా, సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపల్ సెక్రటరీ చిత్రా ఆరుముగం పాల్గొన్నారు.

- రాష్ట్ర పారిశ్రామిక, ఆర్థిక రంగాన్ని గణనీయంగా పెంపొందించే ప్రతిపాదనల ఆమోదానికి మంత్రి మండలి ప్రాధాన్యత కల్పించింది. కటక్ నరాజ్, జగత్‌సింగ్‌పూర్ జిల్లా పారాదీప్‌లో జేఎస్ డబ్ల్యూ గ్రూప్ విద్యుత్ వాహనాలు, అనుబంధ పరికరాలు తయారీ ప్రాజెక్టులకు ప్రత్యేక ప్రోత్సాహక ప్యాకేజీ ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదించింది. రూ.40,000 కోట్లు పెట్టుబడితో ఈ ప్రాజెక్టు ఏర్పాటు చేయడంతో 11 వేల మందికి పైగా ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయి.
- బయోటెక్నాలజీ పరిశ్రమ అభివృద్ధికి దోహదపడే పర్యావరణ వ్యవస్థను రూపకల్పనకు 'ఒడిశా బయోటెక్నాలజీ పాలసీ - 2024' ఆమోదించింది. ఈ రంగంలో ఉన్నత విద్య, పరిశోధన, వ్యవస్థాపన అభివృద్ధిని మరింత ప్రోత్సహిస్తుందని పేర్కొంది. సృజనాత్మకత, ఇంక్యుబేషన్, పెట్టుబడులు, ఆదాయం, వ్యాపార వ్యవస్థ పటిష్ఠతకు సహాయక పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేస్తుందని వెల్లడించింది.
- సూక్ష్మ, లఘు ఉత్పాదన వ్యాపార సంస్థల కోసం ఒడిశా ప్రొక్యూర్‌మెంట్ ప్రిఫరెన్స్ పాలసీ-2023ను మంత్రి మండలి ఆమోదం తెలిపింది. కొత్త విధానం చిన్న తరహా ఉత్పాదన, తయారీ సంస్థల వ్యాపార కార్యకలాపాలను రాష్ట్ర ప్రభుత్వ సంస్థల ద్వారా ప్రిఫరెన్షియల్ ప్రొక్యూర్‌మెంట్ ప్రోత్సహిస్తుందని పేర్కొంది.

క్లుప్తంగా

ఘనంగా అలేఖ్ మహిమా మందిర ప్రారంభోత్సవం



ప్రతిష్ఠాపనోత్సవంలో ఎంపీ, ఎమ్మెల్యేలు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా జొరిగాం సమితి చటాగుడ గ్రామంలో అలేఖ్ మహిమా ధర్మ మందిరం సోమవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో నబరంగ్‌పూర్ పార్లమెంట్ సభ్యుడు రమేష్ చంద్ర మజ్జి, అతని సోదరుడు జొరిగాం ఎమ్మెల్యే ప్రకాష్ చంద్ర మజ్జిలు పాల్గొన్నారు. వీరిద్దరూ తమ కోటా నిధులతో మందిరానికి ఆర్థిక సాయం అందించారు. అనంతరం ఉమ్మర్‌కోట్ సమితి బడగం పర గ్రామంలో అలేఖ్ మహిమా మందిర శిఖర ప్రతిష్ఠాపనోత్సవంలో పాల్గొన్నారు.

వృద్ధురాలి అనుమానాస్పద మృతి



సరోజినీ పట్నాయక్

పర్లాకిమిడి: స్థానిక కరణం వీధి (9వ వార్డు)లో నివాసముంటున్న సరోజినీ పట్నాయక్(72) అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. ఈమె కొన్నాళ్లుగా శ్రీనృసింహ స్వామి ఆలయం వెనుక ఉంటున్నారు. తన ఇంట్లో మంచంపై అచేతన స్థితిలో పడి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. బంగారం, ఇతర సామాన్లు చోరీకి గురైనట్లు తెలిసింది. పర్లాకిమిడి ఆదర్శ పోలీసుస్టేషన్ ఐఐసీ మహేంద్ర భూపతి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి పంపించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

జయపురం: సబ్ డివిజన్ పరిధిలోని బొయిపరిగుడ సమితి టొపాజొడి గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రున్ని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

అదుపు తప్పిన లారీ



ప్రమాదకరంగా ఇళ్ల మధ్యలోకి దూసుకుపోయిన ట్యాంకర్

టెక్కలి రూరల్: మండలంలోని కె.కొత్తూరు గ్రామ సమీప జాతీయ రహదారిపై సోమవారం వేకువజామున ఒక ట్యాంకర్ లారీ అదుపు తప్పి సమీప గ్రామంలోని ఇళ్ల మధ్యలోకి దూసుకు పోయింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. కటక్ నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న ఏపీ31టిఎఫ్1638 నంబర్ గల తారు ట్యాంకర్ లారీ కె.కొత్తూరు గ్రామం వద్ద గల ఫ్లై ఓవర్ వంతెన ఎక్కుతుండగా తన ముందు వెళ్తున్న లారీని తప్పించే ప్రయత్నంలో ఆ లారీని ఢీకొట్టి ఫ్లై ఓవర్ పై నుంచి గ్రామంలోకి దూసుకుపోయి సమీప విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ఆగిపోయింది. ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. ఘటనలో కటక్‌కు చెందిన లారీ డ్రైవర్ అరుణ్ బెహరాకి స్వల్పగాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'పారదర్శకంగా విధులు నిర్వహించాలి'



నాన్ టీచింగ్ స్టాఫ్ సమీక్షలో మాట్లాడుతున్న వీసీ రజని

ఎచ్చెర్ల క్యాంపస్: వర్సిటీలో పనిచేస్తున్న ఉద్యోగులు పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేఆర్ రజిని అన్నారు. వర్సిటీ సెమినార్ హాల్‌లో సోమవారం నాన్ టీచింగ్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ముందుగా రిజిస్ట్రార్ బిడ్డిక అడ్డయ్య బోధనేతర సిబ్బంది వివరాలు వెల్లడించారు. అన్ని విభాగాల్లో 197 మంది ఉద్యోగులు ఉన్నట్లు వివరించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ ఉద్యోగులు వర్సిటీ ప్రగతిలో భాగం కావాలని చెప్పారు. వర్సిటీ పనివేళలు ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు వరకు తప్పని సరిగా సమయపాలన పాటించాలని సూచించారు. గణతంత్ర దినోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నామని, తాను కూడా స్థానికంగా ఉంటూ విధులు నిర్వహిస్తానని తెలిపారు. అన్ని విభాగాల పని తీరును నిరంతరం సమీక్షిస్తానన్నారు. అవినీతి రహిత పాలన లక్ష్యమని చెప్పారు.



ట్రాఫిక్ కాలనీలో శ్రీరాముని పల్లకి సేవ



శ్రీ రామునికి దివ్య హారతి



ఖుర్దారోడ్ ట్రాఫిక్ కాలనీ రామ మందిరం ప్రాంగణంలో దీపారాధన



బొడొ నువాగాంవ్ రామాలయంలో మో పారిబార్ దీపారాధన

జగదానందకారకా..!



జాజ్‌పూర్ వైభవ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో అఖండ పూజార్చనలు

భువనేశ్వర్: అయోధ్యలో బాలరాముని ప్రాణప్రతిష్ట సందర్భంగా ఖుర్దారోడ్ వీధులు రామ నామ స్మరణతో మారుమోగాయి. తొలుత స్థానిక ట్రాఫిక్ కాలనీ రామ మందిరం నుంచి ఉత్సవమూర్తితో పల్లకి సేవ నిర్వహించారు. గోపీనాథ్ మందిరానికి చేరుకుని భజనలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదానం నిర్వహించారు. సాయంత్రం దీపారాధన నిర్వహించారు.

శ్రీరామ ప్రేరణ మంగళకరం..

జట్నీ మునిసిపల్ మండలి పరిధి బొడొ నువా గాంవ్ శ్రీరామ మందిరంలో రామ జ్యోతి ప్రజ్వలన ఘనంగా నిర్వహించారు. మో పారిబార్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, చిన్నారులు పాల్గొని జై శ్రీరామ్ నినాదాలతో హోరెత్తించారు. అయోధ్య రామాలయం నమూనాతోభారీ పతాకాలతో బల్లిభక్ సాహి వీధి మీదుగా లక్ష్మీనారాయణ మందిరం వరకు ఊరేగింపు నిర్వహించారు.

అఖండ ఆరాధన..

జాజ్‌పూర్ వైభవ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో అయోధ్య రామాలయం ప్రాణ ప్రతిష్ట పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి దీపారాధన చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కిటకిటలాడిన రామమందిరాలు

నగరమంతటా రామ మందిరాలు భక్తులతో కిటకిటలాడాయి. సోమవారం ఉదయం నుంచి భక్తుల ఆగమనం ప్రారంభమైంది. అయోధ్య ఆలయం ప్రాణ ప్రతిష్ట ముహూర్తం సమయానికి జనసందోహం పుంజుకుంది. శ్రీరాముని దర్శనం కోసం భక్తులు గంటల తరబడి బారులు తీరారు.



భువనేశ్వర్‌లో యూనిట్ - 3 రామమందిరం వద్ద రద్దీ



పర్లాకిమిడి: జగన్నాథ మందిరం వద్ద భక్తి సంగీత కార్యక్రమం



జట్నీ బల్లిభక్ సాహి వీధుల్లో చిన్నారుల ఆధ్వర్యంలో ఊరేగింపు



పర్లాకిమిడి: జగన్నాథ మందిరం వద్ద దీపారాధన



రామ దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

ప్రదర్శనలు అదరహో..!



వేదికపై అతిథులు, నిర్వాహకులు

బరంపురం: హిల్‌పటాన మెయిన్‌రోడ్డులోని రెండు రోజులుగా జరుగుతున్న నాటక ప్రదర్శనలు అదరహో అనిపిస్తున్నాయి. ఆదివారం రాత్రి గంజాం సాంస్కృతిక భవనంలో ఒడిశా నాటక సమరోహ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన నాటక ప్రదర్శనలను ఏడీఎం వినోద్‌కుమార్ బెహరా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. పర్లాకిమిడికి చెందిన కళాకారుల నాటక ప్రదర్శన ఆలోచింపజేసింది. ఖుర్దా బృందం ప్రదర్శన కట్టిపడేసింది. కార్యక్రమంలో అధ్యక్షుడు అనిల్‌కుమార్ పాత్రో, కార్యదర్శి మెహర్ త్రిపాఠి, సహాయ కార్యదర్శి శంకర్షణ్ సబత్, ఉపాధ్యక్షుడు ఉపేంద్రకుమార్ సాహు తదితరులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న 'కులమణి' నాటిక ప్రదర్శన



'జయవీర్' నాటికలో ఓ సన్నివేశం

17 మంది కలెక్టర్ల బదిలీ

భువనేశ్వర్ : రాష్ట్రంలో భారీ స్థాయిలో ఐఏఎస్ అధికారులు బదిలీ అయ్యారు. త్వరలో జరగనున్న ఎన్నికల ముందు ఈ ఉత్తర్వులు జారీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఐఏఎస్‌ల పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఒడిశాలోని పలు జిల్లాలకు కొత్త కలెక్టర్లు కూడా వచ్చారు. 2018, 2019 బ్యాచ్‌లకు చెందిన 10 మంది ఐఏఎస్ అధికారులు తొలిసారిగా జిల్లా కలెక్టర్లుగా నియమితులయ్యారు. 2020, 2021 బ్యాచ్‌ల వారు అదనపు జిల్లా మేజిస్ట్రేట్‌లు, సబ్ కలెక్టర్లుగా నియమితులైనట్లు సాధారణ పరిపాలన శాఖ విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.

- కటక్ రెవెన్యూ డివిజనల్ కమిషనర్ (సెంట్రల్ డివిజన్)గా శ్రీజగన్నాథ ఆలయ ప్రధాన పాలన అధికారి(సీఏఓ) రంజన్ కుమార్‌దాస్ బదిలీ అయ్యారు. ఈ హోదాతో పాటు బరంపురం రెవెన్యూ డివిజనల్ కమిషనర్ (దక్షిణ విభాగం) ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తారు.
- పూరీ కలెక్టర్ సమర్థ వర్మను పూరీ జగన్నాథ ఆలయం అదనపు ప్రధాన పాలన అధికారి ఏసీఏఓగా నియమించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి బిజయ్ కుమార్‌దాస్ ఆయన స్థానంలో పూరీ కలెక్టర్‌గా బదిలీపై వెళ్లారు.
- ఖుర్దా కలెక్టర్ కె.సుదర్శన్ చక్రవర్తి మైనర్ మినరల్స్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. బొలంగీర్ కలెక్టర్ చంచల్ రాణా అతని స్థానంలో ఖుర్దా కలెక్టర్‌గా నియమితులయ్యారు. కొరాపుట్ జిల్లా పరిషత్ సీడీఓ కమ్ ఈఓ గౌరవ్ శివాజీ ఇసల్వార్ బొలంగీర్ కలెక్టర్‌గా నియమితులయ్యారు.
- కటక్ మునిసిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) కమిషనర్ నిఖిల్ పవన్ కల్యాణ్ గ్రామీణాభివృద్ధి డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఆయన స్థానంలో అంగుల్ కలెక్టర్ సిద్ధార్థ్ శంకర్ స్వంయి కటక్ నగర పాలక సంస్థ కమిషనర్‌గా నియమితులయ్యారు. కొరాపుట్ కలెక్టర్ అబ్దాల్ అక్తర్‌ను అంగుల్‌కు బదిలీ చేశారు. గంజాం జిల్లా పరిషత్ సీడీఓ కమ్ ఈఓ కీర్తివాసన్ కొరాపుట్ కలెక్టర్‌గా నియమితులయ్యారు.
- బర్‌గడ్ కలెక్టర్ మోనిషా బెనర్జీ సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఇక్కడ ఇంత వరకు బాధ్యతలు నిర్వహించిన లింగరాజ్ పండా సహకార శాఖ సంయుక్త కార్యదర్శిగా నియమితులయ్యారు. బర్‌గడ్ జిల్లా పరిషత్ సీడీఓ కమ్ ఈఓ ఆదిత్య గోయల్ బర్‌గడ్ కలెక్టర్‌గా నియమితులయ్యారు.
- కెంజొహర్ కలెక్టర్ అశిష్ ఠాకరే మయూర్‌భంజ్‌కు బదిలీ అయ్యారు. ఇంతకుముందు ఇక్కడ పని చేసిన వినీత్ భరద్వాజ్ ఇప్పుడు కటక్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. జలవనరుల శాఖ ప్రభుత్వ అదనపు కార్యదర్శిగా నరహరి సెతి నియమితులయ్యారు. అశిష్ ఠాకరే స్థానంలో మల్కన్‌గిరి కలెక్టర్ విశాల్‌సింగ్ కెంజొహర్ కలెక్టర్‌గా నియమితులయ్యారు. కలహండి జిల్లా పరిషత్ సీడీఓ కమ్ ఈఓ పవార్ సచిన్ ప్రకాష్ మల్కన్‌గిరి కలెక్టర్‌గా నియమితులయ్యారు.
- సంబల్‌పూర్ కలెక్టర్ అనన్య దాస్ చేనేత జౌళి, హస్తకళల శాఖ ప్రభుత్వ సంయుక్త కార్యదర్శిగా నియమితులయ్యారు. ఆమె స్థానంలో మయూర్‌భంజ్ కలెక్టర్ అక్షయ్ సునీల్ అగర్వాల్ సంబల్‌పూర్ కలెక్టర్‌గా వచ్చారు.
- రాయగడ కలెక్టర్ స్వధా దేవ్ సింగ్ నయాగడ్ కలెక్టర్‌గా నియమితులయ్యారు. సుందర్‌గడ్ జిల్లా పరిషత్ సీడీఓ కమ్ ఈఓ మనోజ్ సత్యవాన్ మహాజన్ రాయగడ కలెక్టర్‌గా నియమితులయ్యారు. బరంపురం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జె.సోనల్ బౌధ్ కలెక్టర్‌గా నియమితులయ్యారు. బలిగుడ సబ్-కలెక్టర్ మధుమిత ఆమె స్థానంలో వచ్చారు.
- బౌధ్ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఓఏఎస్ అధికారి నృసింహ చరణ్ స్వంయి రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శిగా నియమితులయ్యారు.
- నవరంగపూర్ జిల్లా పరిషత్ సీడీఓ కమ్ ఈఓ అన్య దాస్ సోన్‌పూర్ కొత్త కలెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ స్థానంలో బాధ్యతలు నిర్వహించిన ఓఏఎస్ అధికారి బిమలేందు ఈపీఎం డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు.
- కేంద్రపడా కలెక్టర్ అమృత్ ఋతురాజ్ రాష్ట్ర కారిక కమిషనర్‌గా నియమితులయ్యారు. ఆయన స్థానంలో కేంద్రపడా కలెక్టర్‌గా భువనేశ్వర్ నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ సూర్యవంశీ మయూర్ వికాస్ నియమితులయ్యారు.
- జాజ్‌పూర్ కలెక్టర్ చక్రవర్తి సింగ్ రాథోడ్‌ను పంచాయతీరాజ్ తాగునీటి విభాగం సంయుక్త కార్యదర్శిగా నియమించారు. రౌర్కెలా మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న శుభంకర్ మహపాత్ర జాజ్‌పూర్ కలెక్టర్‌గా బదిలీ అయ్యారు.
- బరంపురం సబ్-కలెక్టర్ కులకర్ణి అశుతోష్ సి రౌర్కెలా మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా నియమితులయ్యారు. ఈ హోదాతో పాటు రౌర్కెలా స్మార్ట్ సిటీ లిమిటెడ్ సీఈఓ, రౌర్కెలా ఏడీఎం, రౌర్కెలా డెవలప్‌మెంట్ అథారిటీ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తారు. రెవెన్యూ డివిజనల్ కమిషనర్ (దక్షిణ విభాగం), బరంపురం టిమ్‌జెన్ వాపాంగ్ ఏవో ప్రభుత్వ రంగ సంస్థల విభాగం కమిషనర్ కమ్ సెక్రటరీగా నియమితులయ్యారు.
- ధీమాన్ చక్మా ధర్మగర్ (కలహండి) సబ్ కలెక్టర్‌గా, టిట్లాగఢ్ (బొలంగీర్) సబ్ కలెక్టర్‌గా రెహాన్ ఖత్రీ నియమితులయ్యారు. బాలాసోర్ సబ్ కలెక్టర్‌గా ప్రథమేష్ అరవింద్ రాజేషిర్కే, కిరణ్‌దీప్ కౌర్ సహోటా గుణుపురం (రాయగడ) సబ్ కలెక్టర్‌గా నియమితులయ్యారు. రీనా ప్రధాన్ బలిగుడ (కంధమల్) సబ్ కలెక్టర్‌గా, ధీనా దస్తగర్ బరంపురం సబ్ కలెక్టర్‌గా నియమితులయ్యారు. కుచిండా సబ్ కలెక్టర్ బిభూతి భూషణ్ నాయక్ మయూర్‌భంజ్ అదనపు జిల్లా మేజిస్ట్రేట్‌గా నియమితులయ్యారు.

రోడ్డు ప్రమాదంలో మహిళా ఉద్యోగి దుర్మరణం



ఉమా మహేశ్వరి (ఫైల్)

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జి.ఉమామహేశ్వరి (62) సోమవారం రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. శ్రీకాకుళం గుజరాతీపేటలో ఉంటున్న ఆమె సోమవారం కాలేజీకి ఆటోలో వెళ్లి, కళాశాల గేటు ముందు దిగారు. రోడ్డు దాటుకుని వస్తుండగా అటుగా వేగంగా వస్తున్న బైక్ ఆమెను ఢీకొట్టింది. ఆ ధాటికి తలకు బలమైన గాయాలై ఘటనా స్థలంలోనే ఊపిరి వదిలేశారు. స్థానికులు సహాయ చర్యలకు ప్రయత్నించినా ఆమెను కాపాడలేకపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైన బైక్ చోదకుడిని అదుపులోకి తీసుకున్నారు. గుజరాతీపేటలో నివాసం ఉంటున్న ఉమామహేశ్వరికి భర్త మృతితో ఈ ఉద్యోగం లభించింది. అంకిత భావంతో విధులు నిర్వర్తిస్తూ ఉత్తమ ఉద్యోగిగా గుర్తింపు పొందారు. ఈమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఉద్యోగి మృతిపై కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్‌డీఎల్‌పీ క్రిస్టియన్, బోధన, బోధనేతర సిబ్బంది సంతాపం తెలియజేశారు. సంక్రాంతి సెలవుల అనంతరం సోమవారమే కాలేజీ పునఃప్రారంభించారు. అదే రోజు ఉద్యోగి చనిపోవడంతో కళాశాలలో విషాదం అలముకుంది.

గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



లక్ష్మణరావు మృతదేహం వద్ద టూటౌన్ ఎస్‌ఐ లక్ష్మి

శ్రీకాకుళం క్రైమ్ : బైరివానిపేటకు చెందిన బంగారు లక్ష్మణరావు గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. మద్యపానంపై కుటుంబ సభ్యులు ప్రశ్నించినందుకు ఆయన బలవన్మరణానికి పాల్పడ్డారు. రెండో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ కె.లక్ష్మి తెలిపిన వివరాల మేరకు.. బైరివానిపేటకు చెందిన లక్ష్మణరావు తాపీమేస్త్రీ పని చేస్తూ భార్య సరస్వతి, ఇద్దరు కుమారులు సంతోష్‌కుమార్, తేజేశ్వరరావులతో కలిసి జీవిస్తున్నాడు. కుమారులకు వివాహాలు అయిపోయాయి. లక్ష్మణరావుకు మొదటి నుంచీ మద్యం తాగే అలవాటు ఉండేది. కుటుంబ సభ్యులంతా మానేయమని ప్రాధేయపడేవారు. ఈ క్రమంలో ఆయన ఈ నెల 16న తన అత్తవారి గ్రామమైన ఎం.సింగుపురం వెళ్లారు. 19న పనికెళ్తానని ఒక్కడే ఇంటికి వచ్చేశారు. ఆ తర్వాతి రోజు సరస్వతి, సంతోష్, తేజేష్‌లు వచ్చి చూసేసరికి లక్ష్మణరావు పనికి వెళ్లకుండా మద్యం మత్తులో పడుకుని ఉన్నారు. సాయంత్రం లక్ష్మణరావు లేచాక సరస్వతి మందలించడంతో బయటకు వెళ్లిపోయి తిరిగి రాత్రి 7.40గంటలకు వచ్చి పెరడు కెళ్లి గడ్డిమందు తాగారు. వెంటనే కుటుంబసభ్యులు నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి ఈ నెల 21న విశాఖ తరలించగా అక్కడ ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లక్ష్మి చెప్పారు.

డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం



గాయత్రీ డిగ్రీ కళాశాలలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు.

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ బీఏ, బీఎస్సీ, బీకాం, బీబీఎం పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. పరీక్షలు మధ్యాహ్నం 2 గంటలు నుంచి సాయంత్రం ఐదు గంటలు వరకు జరుగుతున్నాయి. ఫిబ్రవరి 4వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. 61 పరీక్ష కేంద్రాల్లో జరుగుతున్న ఈ పరీక్షలకు రెగ్యులర్, బ్యాక్‌లాగ్ సబ్జెక్టు ఉన్న విద్యార్థులు 14950 మంది హాజరయ్యారు. పరీక్షలు సజావుగా పూర్తయ్యేలా అధికారులు పూర్తిఏర్పాట్లు చేశారు. మొదటి రోజు పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ తెలిపారు.

పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల జాబితా

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్ల జాబితా అందుబాటులో ఉంటుందని శ్రీకాకుళం ఆర్డీఓ(ఇఆర్ఓ) సీహెచ్ రంగయ్య సోమవారం వెల్లడించారు. ఎలక్షన్ కమిషన్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని రాజకీయ పార్టీల సమక్షంలో ఓటర్ లిస్ట్ (ఫైనల్ రోల్) శ్రీకాకుళం నియోజకవర్గంలోని 279 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఎలక్టోరల్ రోల్ పబ్లికేషన్ చేయడం జరిగిందని, అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల జాబితా అందుబాటులో ఉంటుందన్నారు. ఓటర్లు తమ పేర్లను పరిశీలించి తమ పేర్లు ఉన్నదీ లేనిదీ చూసుకోవాలన్నారు. శ్రీకాకుళం తహసీల్దార్ (ఏఈఆర్ఓ) కె.వెంకటరావు పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో ఏసీబీ కోర్టు న్యాయమూర్తి



ఆదిత్యుని జ్ఞాపికను న్యాయమూర్తి మురళీ కృష్ణ దంపతులకు అందజేస్తున్న ఈఓ హరిసూర్యప్రకాష్

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని విశాఖపట్నం ఏసీబీ కోర్టు న్యాయమూర్తి మురళీకృష్ణ సతీసమేతంగా సోమవారం ఉదయం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్, అర్చకులు ఇప్పిలి సాందీప్‌శర్మలు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఆలయ విశిష్టతను అర్చకులు న్యాయమూర్తికి వివరించారు. అనంతరం వేదాశీర్వచనాన్ని అందజేసి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది బీఎస్ చక్రవర్తి, అర్చకులు సాందీప్ శర్మ పాల్గొన్నారు.

పెద్ద మనసు చాటుకున్న ప్రవాసాంధ్రులు



మృతుడు భార్య పుష్పకు బాండ్, నగదును అందజేస్తున్న 'పోటా' సభ్యుడు రామసతీష్

ఇచ్ఛాపురం రూరల్: ప్రవాసాంధ్రులు పెద్ద మనసు చాటుకున్నారు. ఇచ్ఛాపురం మండలం ధర్మపురం గ్రామానికి చెందిన ఉప్పాడ సోమేశ్‌రెడ్డి పోలెండ్‌లో కూలి పనికి వెళ్లి అనారోగ్యంతో 2023 డిసెంబర్ 16న అక్కడే మృతి చెందాడు. వెంటనే స్పందించిన 'పోలెండ్ తెలుగు అసోసియేషన్' (పోటా) సభ్యులు అక్కడికక్కడే మృతదేహాన్ని ఖననం చేసి అస్తికలను స్వగ్రామానికి పంపించారు. 'పోటా' కమిటీ ప్రధాన కార్యదర్శి, ప్రవాసాంధ్రుడు పైలా విజయకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రూ.3లక్షల 75లను నగదును సేకరించారు. రూ.3లక్షల 50వేలను ఎస్‌బీఐ లైఫ్ బాండ్ రూపంలో, పాతిక వేలు నగదును 'పోటా' కమిటీ సభ్యుడు రామసతీష్ సోమవారం ఇండియా వచ్చి ధర్మపురంలో మృతుడి భార్య ఉప్పాడ పుష్ప, 8 నెలలు కుమార్తె కావ్యశ్రీకి గ్రామ పెద్దలు సమక్షంలో అందజేశారు. పెద్ద దిక్కు కోల్పోయి నిరాశ్రయులైన కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన పోలెండ్ తెలుగు అసోషియేషన్ సభ్యులకు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

స్వల్పకాలిక కోర్సులతో మహిళలకు ఉపాధి

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని నందమూరి తారక రామారావు నైపుణ్య అభివృద్ధి, మహిళా సాధికార కేంద్రంలో మూడు నెలల స్వల్పకాలిక కోర్సుల్లో శిక్షణలకు మహిళల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మేనేజర్ కె.పార్వతి తెలిపారు. శిక్షణ కేంద్రంలో సోమవారం వివరాలు వెల్లడించారు. 10వ తరగతి పాస్, ఫెయిల్ విద్యార్హత గల 18 నుంచి 40 ఏళ్ల మధ్య మహిళలు అర్హులుగా చెప్పారు. ఫ్యాషన్ టెక్నాలజీ, బ్యూటీషియన్‌తో పాటు పలు ఉపాధి కోర్సుల్లో శిక్షణలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ నెల 31లోపు ఆసక్తిగల మహిళలు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. విద్యార్హత, కుల ధ్రువీకరణ, ఆధార్ కార్డు, రెండు పాస్ పోర్టు సైజ్ ఫొటోలు దరఖాస్తులకు జతచేయాలని చెప్పారు. కోర్సులు, ఇతర వివరాలకు ఫోన్ నంబర్లు 8333921337, 7416764419ను సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

25న ఓటరు దినోత్సవంపై చిత్ర లేఖనం పోటీలు


రెవెన్యూ డివిజనల్ అధికారి కె.హేమలత

పార్వతీపురంటౌన్: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఈ నెల 25వ తేదీన పార్వతీపురం మన్యం జిల్లాస్థాయి చిత్ర లేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్లు రెవెన్యూ డివిజనల్ అధికారి కె. హేమలత తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. 'ప్రజాస్వామ్యంలో ఓటు ప్రాధాన్యం' అనే అంశంపై జిల్లా స్థాయి చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆమె చెప్పారు. ఈ పోటీలు 25వ తేదీ ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో జరుగుతాయని పేర్కొన్నారు. పోటీలలో పాఠశాల, కళాశాల విద్యార్థులు, ఆసక్తిగల పౌరులు పాల్గొనవచ్చని తెలిపారు. చిత్రలేఖనం పోటీలకు సంబంధించి కాన్వాస్ పేపర్‌ను సరఫరా చేస్తామని, ఇతర సామగ్రిని పోటీలో పాల్గొంటున్న విద్యార్థులు, అభ్యర్థులు తీసుకురావాలని స్పష్టం చేశారు.

ఎరువుల దుకాణాల తనిఖీ


బలిజిపేటలో ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న అధికారులు

బలిజిపేట: మండల కేంద్రం బలిజిపేటలో గుమలక్ష్మీపురం సహాయ సంచాలకురాలు ఎ.నిర్మలాజ్యోతి ఆధ్వర్యంలో ఎరువుల దుకాణాలను అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా షాపుల్లో రికార్డులు సక్రమంగా నిర్వహిస్తున్నదీ లేనిదీ, స్టాకు రికార్డుల ప్రకారం సరుకు ఉందో, లేదా అని గమనించారు. ఎరువుల బస్తాల బరువులను తూకం వేయించారు. షాపులలో వివరాలు సక్రమంగా ఉండాలని ఎక్కడైనా పొరపాట్లు జరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. షాపుల వద్ద నిర్ధారించిన రేట్లకే విక్రయాలు జరపాలని సూచించారు. ఎక్కువ ధరలకు విక్రయాలు జరిపితే చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఓ శ్రావణ్, సిబ్బంది పాల్గొన్నారు.

24న పీఎం విశ్వకర్మ పథకంపై అవగాహన

పార్వతీపురం: విశ్వకర్మ పథకంపై అవగాహన సదస్సును ఈ నెల 24న నిర్వహిస్తున్నట్లు ఎంఎస్ఎంఈ సహాయ సంచాలకుడు డీవీఎస్ఆర్ మూర్తి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 24వ తేదీ ఉదయం 10 గంటలకు ఐటీడీఏ సమావేశ మందిరంలో ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంపై భారత ప్రభుత్వం ఆధ్వర్యంలోని ఎంఎస్ఎంఈ -అభివృద్ధి, సదుపాయాల కల్పన కార్యాలయం జిల్లా పరిశ్రమల శాఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, జిల్లా గ్రామ పంచాయతీ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించనున్నట్లు చెప్పారు. స్వయం ఉపాధి రంగంలో కుటుంబ ఆధారిత వ్యాపారాల్లో నిమగ్నమైన చేతి పనిముట్లతో చేసే చేతి వృత్తిదారుల కోసం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పీఎం విశ్వకర్మ పథకం కోసం రిజిస్ట్రేషన్ చేయనున్నామని, సంబంధిత కులవృత్తి దారులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం ద్వారా వచ్చే లబ్ధిని పొందాలని కోరారు. వివరాలకు డీవీఎస్ఆర్ మూర్తి (9492689462)ని సంప్రదించాలని సూచించారు.

అనారోగ్యంతో గిరిజన చిన్నారి మృతి

శృంగవరపుకోట: మండలంలోని మూలబొడ్డవర పంచాయతీ పరిధి చిట్టంపాడు గ్రామానికి చెందిన గిరిజన చిన్నారి సోమవారం మధ్యాహ్నం మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన జన్ని సన్యాసిరావు-సన్యాసమ్మ దంపతులకు ఒక కుమార్తె, ఏడాదిన్నర వయస్సున్న కుమారుడు ఉన్నారు. ఏడాదిన్నర వయస్సున్న జన్ని ప్రవీణ్ కఫం, దగ్గుతో ఇబ్బంది పడుతుండగా శనివారం సాయంత్రం ఎస్.కోట ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. ప్రభుత్వాస్పత్రిలో వైద్యం చేసిన వైద్యులు సోమవారం విజయనగరం ఘోషాఆస్పత్రికి రిఫర్ చేశారు. ఘోషాఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతిచెందాడు. దీంతో తల్లిదండ్రులు ప్రవీణ్ మృతదేహాన్ని ప్రైవేట్ వాహనంలో బొడ్డవర రైల్వేస్టేషన్ వరకూ తీసుకువచ్చి అక్కడి నుంచి డోలీలో గ్రామానికి తరలించారు. అయితే గ్రామానికి చెందిన అదే వయస్సులో ఉన్న ముగ్గురు చిన్నారులు ఇటీవల వరుసగా మృత్యుఒడికి చేరడం గ్రామస్తులను కలవరపెడుతోంది. చిన్నారుల మరణానికి కారణాలు తెలియడం లేదని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

రైలు ఢీకొని వ్యక్తి..

విజయనగరం క్రైమ్: స్థానిక ద్వారపూడి గ్రామానికి చెందిన దాసరి రాము (33) గ్రామ సమీపంలో రైల్వే ట్రాక్ దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొని సోమవారం మృతిచెందాడు. అయితే ఆత్మహత్యకు పాల్పడ్డాడా? ఇతర కారణాలేమైనా ఉన్నాయా? అన్నది విచారణలో తేలాల్సి ఉందని పోలీసులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. రాము పెయింటింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్సై రవివర్మ తెలిపారు.

ఏరువాక సాగారో..!


తలపై ఘటం ఎత్తుకున్న భక్తురాలు

మట్టిలో పుట్టి..మట్టిలో పెరిగి..మట్టి తల్లినే నమ్ముకుని..వ్యవసాయం చేయడమే తప్ప మరో వ్యాపకం తెలియని రైతులు పోలమాంబ తొలేళ్ల ఉత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఏడాదికి ఒకసారి వచ్చే శంబర పోలమాంబ తొలేళ్ల ఉత్సవం కోసం కన్నులు కాయలు కాచేలా ఎదురు చూసిన అన్నదాతలకు ఆ ఉత్సవం రానే వచ్చింది. గ్రామంలోని సంప్రదాయ జన్ని, గిరడ కుటుంబాల వారి నుంచి సేకరించిన విత్తనాలను రైతులంతా కలిసి పోలమాంబ ఒడిలో ఉంచి పూజలు చేశారు. తరువాత కాడి కట్టి ఏరు పూసి భుజాలపై పూజు మోసి అమ్మవారికి చేతులు జోడించి నమస్కరించారు. అనంతరం పూజ చేసిన విత్తనాలను గ్రామంలోని రైతులందరూ పంచుకున్నారు. పంట సాగు చేసే సమయంలో పొలంలో వేసే విత్తనాల్లో పూజ చేసి సేకరించిన విత్తనాలను కలిపి సాగు చేస్తే పంట బాగా కలిసివస్తుందని రైతుల నమ్మకం. ఏటా శంబర పోలమాంబ పండగ సందర్భంగా జరిగే తొలేళ్ల సంప్రదాయం ఇది.


పోలమాంబ అమ్మవారు


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

- ఘనంగా పోలమాంబ తొలేళ్ల ఉత్సవం
- బాలరాముని ప్రతిష్ట కార్యక్రమంతో తగ్గిన భక్తుల రద్దీ
- అమ్మవారిని దర్శించుకున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, ఆరాధ్యదైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శంబర పోలమాంబ అమ్మవారి తొలేళ్ల ఉత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ ఉత్సవాన్ని ఎస్పీ విక్రాంత్‌పాటిల్, అదనపు ఎస్పీ దిలీప్‌కిరణ్, ఏఎస్పీ సునీల్ సొరేన్, జిల్లా దేవాదాయశాఖ అధికారి డీవీవీ ప్రసాదరావు, ఈవో వీవీ సూర్యనారాయణ పర్యవేక్షించారు.

తొలేళ్లకు తగ్గిన భక్తుల రద్దీ

శంబర పోలమాంబ తొలేళ్ల ఉత్సవానికి గతేడాది కంటే ఈఏడాది భక్తుల రద్దీ తగ్గింది. ఆయోధ్యలో బాలరాముని ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామాల్లోని రామాలయాల వద్ద పూజలు చేసిన కారణంగా భక్తుల రద్దీ తగ్గింది. మంగళవారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తు న్నారు. ప్రధానాలయం వెనుక భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు వీలుగా ఉచిత దర్శనం, రూ.20, రూ.100 క్యూలు ఏర్పాటు చేశారు. భక్తులు ప్రధానాలయంలో ఉన్న అమ్మవారిని, వనంగుడిలో కొలువైన పెదపోలమాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. వనంగుడి వెనుక ఉన్న వేపచెట్టుకు పూజలు చేశారు. కోళ్లు, చీరలు, తలనీలాలు, మొక్కుబడి ఘటాలు సమర్పించి చీపుళ్లతో రహదారులను శుభ్రంచేసి మొక్కులు తీర్చుకున్నారు.

ఉత్సవం సాగిందిలా..

ఆదివారం రాత్రి అమ్మవారి ఘటాలు ప్రధాన వీధిలోని అమ్మవారి గద్దె వద్దకు చేరుకున్నాయి. గద్దె వద్ద అమ్మవారి ఘటాలను ఉంచి, కారుగేదవాలకాలను నిర్వహించారు. మహిషాసురుడు, పోతురాజు వేషధారణ, మేళతాళాలు, గ్రామస్తుల కేరింతల మధ్య కార్యక్రమం జరిగింది. సోమవారం గ్రామానికి చెందిన రైతులు ఉపవాసాలు ఉండి రాత్రి ఏరోత్సవం నిర్వహించారు. తొలుత గ్రామపెద్దలంతా జన్నివారి ఇంటికి వెళ్లి వారిని పిలిచి ఏరోత్సవం నిర్వహించారు. జన్నివారు, గిరిడవారి ఇంటి నుంచి విత్తనాలను తీసుకువచ్చి అమ్మవారి వద్ద ఉంచి పూజచేశారు. అమ్మవారికి అక్షింతలు చల్లి, రైతులు కాడి మీద నిలబడి పశువుల ఏరుపూజుకు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గిరడవారు తెచ్చిన విత్తనాలకు అమ్మవారి వద్ద పూజ చేసిన తరువాత రైతులు తలోపిడికెడు విత్తనాలు ఇంటికి తీసుకుని వెళ్లారు. పంటలు సాగు చేసిన సమయంలో ఈవిత్తనాల్లో వారివద్దనున్న విత్తనాలు కలిపి పొలంలో చల్లుతారు.

సిరిమానును పరిశీలించిన ఆర్అండ్‌బీ జేఈ

గ్రామపెద్దల సమక్షంలో వండ్రంగులు సిరిమానును తయారుచేయగా, రైతులు సిరిమాను బండిని సిద్ధం చేశారు. మంగళవారం జరగనున్న సిరిమానోత్సవం కార్యక్రమానికి అవసరమైన సిరిమానును, నాటుబండిని ఆర్అండ్‌బీ జేఈ కమలాకర్ సోమవారం పరిశీలించారు.

జాతర ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ

జాతర ఏర్పాట్లను ఎస్పీ విక్రాంత్‌పాటిల్ సోమవారం పరిశీలించారు. ముందుగా క్యూలు తనిఖీ చేసి భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని సీఐ ధనుంజయరావుకు సూచించారు. అనంతరం పార్కింగ్‌స్థలాలు, సీసీకెమెరాల ఏర్పాట్లపై అదనపు ఎస్పీ దిలీప్‌కిరణ్, ఏఎస్పీ సునీల్‌సొరేన్‌తో చర్చించారు. చివరగా చదురుగుడిలో పోలమాంబ అమ్మవారిని దర్శించుకున్నారు.


క్యూలను పరిశీలిస్తున్న జిల్లా దేవాదాయ శాఖ అధికారి ప్రసాదరావు


అమ్మవారిని దర్శించుకున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్, అదనపు ఎస్పీ దిలీప్‌కిరణ్


తలనీలాలు సమర్పించుకుంటున్న చిన్నారి

తాగునీటి సరఫరా

జాతరకు వచ్చిన భక్తులకు దేవాదాయశాఖాధికారులు, సత్యసాయిసేవాసమితి సభ్యులు తాగునీటిని అందజేశారు.

సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలి

- కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజలు తెలియజేసిన సమస్యల పరిష్కారానికి అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్, జిల్లారెవెన్యూ అధికారి జె.వెంకటరావు, కేఆర్‌సీసీ ఎస్‌డీసీ జి.కేశవనాయుడుతో కలిసి ప్రజలనుంచి 140 వినతులను కలెక్టర్ స్వీకరించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజలు తెలియజేసిన సమస్యల గురించి సంబంధిత జిల్లా, మండల అధికారులతో నేరుగా మాట్లాడి సమస్యల పరిష్కారానికి ఆదేశాలు జారీచేశారు. అర్జీలపై సకాలంలో స్పందించి, చర్యలు తీసుకోవాలని సూచించారు.


అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ నిషాంత్ కుమార్

కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డి.జగన్నాథరావు, డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఒ.ప్రభాకరరావు, పీఆర్ ఈఈ ఎంవీఆర్ కృష్ణాజీ, హౌసింగ్ పీడీ రమేష్, డీపీఓ బి.సత్యనారాయణ, వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్, తదితరులు పాల్గొన్నారు.

వినతులు సకాలంలో పరిష్కరించాలి

విజయనగరం అర్బన్: జగనన్నకు చెబుదాంలో ప్రజల నుంచి వివిధ శాఖలకు వచ్చే వినతులను సకాలంలో ప్రజలు సంతృప్తి చెందేరీతిలో పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారిణి ఎస్‌డీఅనిత అధికారులకు సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించి ఆర్‌డీఓ ఎంవీసూర్యకళ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వెంకటేశ్వరరావు, సుదర్శనదొర, సుమబాల తదితరులతో కలిసి 311 వినతులు స్వీకరించి వాటిని సంబంధిత శాఖలకు పరిష్కారం కోసం సిఫారసు చేశారు.

జిల్లాలో భూగర్భ జలాలను పరిరక్షించాలి

- జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

విజయనగరం అర్బన్: జిల్లాలో భూగర్భ జలాల పరిరక్షణకు గ్రామస్థాయిలో ప్రణాళికలు రూపొందించాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ సూచించారు. జిల్లాలో ప్రస్తుతం భూగర్భ జలాల పరిస్థితి సంతృప్తికరంగా తక్కువలోతులోనే అందుబాటులో ఉన్నాయన్నారు. అయినప్పటికీ భవిష్యత్తులో ఇబ్బంది రాకుండా ఇప్పటి నుంచే చర్యలు చేపట్టడం మంచిదని సూచించారు. భూగర్భ జల అంచనా 2022-23 వివరాలను, కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన వెల్లడించారు.

భూగర్భ జలాలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందని ఈ సందర్భంగా చెప్పారు. ముఖ్యంగా గ్రామ స్థాయిలో భూగర్భ జలపరిరక్షణపై శాస్త్రీయ దృక్పథంతో అవగాహన కల్పించాలని సూచించారు. దీనికోసం అందుబాటులో ఉన్న శాస్త్రీయ పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని జేసీ కోరారు. భూగర్భ జలశాఖ డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాదరావు మాట్లాడుతూ భూగర్భ జలఅంచనా 2022-23 ముఖ్య అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పూసపాటిరేగ మండలంలో పారిశ్రామిక వినియోగం ఎక్కువగా ఉందని, రీచార్జ్ కంటే నీటి వినియోగం ఎక్కువగా ఉన్నచోట ఎటువంటి నీటి పథకాలకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు. నీటి లభ్యతలో మన జిల్లా ఐదో స్థానంలో, డ్రాఫ్టలో 12వ స్థానంలో ఉందన్నారు.

మెరకముడిదాం మండలంలో నీటి లభ్యత ఎక్కువగా, పూసపాటి రేగ మండలం వినియోగంలో మొదటి స్థానంలో ఉన్నాయని చెప్పారు. రైతులకు అవగాహన కల్పించి, పంటల సాగును మార్చడం ద్వారా కూడా కొంత వరకు భూగర్భ జలాలను పరిరక్షించవచ్చని సూచించారు. సమావేశంలో సీపీఓ పి.బాలాజీ, జిల్లా వ్యవసాయాధికారి తారకరామారావు, పశు సంవర్ధక అధికారి డాక్టర్ విశ్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

శంబర సిరిమానోత్సవానికి సర్వం సిద్ధం

- నేడే పోలమాంబ సిరిమానోత్సవం
- మధ్యాహ్నం 2.30-3 గంటల మధ్యలో సిరిమానోత్సవం ప్రారంభం
- మూడు లక్షలమందికి పైగా భక్తులు వస్తారని అధికారుల అంచనా
- ఆ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం



మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, భక్తుల ఆరాధ్య దైవం శంబర పోలమాంబ అమ్మవారి సిరిమాను సంబరానికి వేళయింది. ముహూర్తం ప్రకారం మంగళవారం మధ్యాహ్నం 2.30 నుంచి 3 గంటల మధ్యలో సిరిమానోత్సవం ప్రారంభంకానుంది. పూజారి జన్నిపేకాపు భాస్కరరావు సిరిమానును అధిరోహించనున్నారు. దీనికి అవసరమైన అన్ని ఏర్పాట్లను దేవదాయశాఖ అధికారులు పూర్తిచేశారు. సిరిమాను, సిరిమాను బండిని సోమవారం సాయంత్రానికే సిద్ధం చేశారు. అమ్మవారి సిరిమానోత్సవంలో రాష్ట్రంలోని నలుమూలలతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన భక్తులు సుమారు 3 లక్షల మంది వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. వీరికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ అధికారులు 150 బస్సులను నడుపుతోంది. ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆధ్వర్యంలో 700 మంది పోలీసులు బందోబస్తు విధులు నిర్వహించనున్నారు. వీరిలో నలుగురు డీఎస్పీలు, 15 మంది సీఐలు, 40మంది ఎస్ఐలు, ఏఎస్ఐలు ఉన్నారు. పోలీస్ కంట్రోల్ రూమ్ నుంచి జాతరను పర్యవేక్షిస్తారు. ముఖ్య కూడళ్లలో సీసీ కెమెరాలు అమర్చారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. విధుల నిర్వహణపై సిబ్బందికి ఎస్పీ దిశానిర్దేశం చేశారు.


సుందరంగా ముస్తాబైన శంబర పోలమాంబ ఆలయం


సిద్ధమైన సిరిమాను బండి

క్యూ కాంప్లెక్స్‌లు

దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ డి.వి.వి ప్రసాదరావు పర్యవేక్షణ, ఆలయ ఈఓ వి.వి.సూర్యనారాయణ ఆధ్వర్యంలో ప్రధానాలయం, వనంగుడి వద్ద ఉచిత, రూ.20, రూ.100 టిక్కెట్ కౌంటర్లు, క్యూకాంప్లెక్స్‌లను ఏర్పాటుచేశారు. భక్తులకు ఎండ తగలకుండా ఉండేందుకు షామియానాలు వేశారు. క్యూలలో చిన్నపిల్లలకు పాలు అందించనున్నారు. 30 వేలు లడ్డూప్రసాదాన్ని తయారుచేశారు. భక్తులకు అవసరమైనంత వీలుగా పులిహోర ప్రసాదాన్ని తయారు చేయించారు. వనంగుడి, చదురుగుడి అవుట్‌గేట్‌వద్ద, వైఎస్సార్ విగ్రహం వద్ద ప్రసాదం కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తులకు వినోదాన్ని అందించేందుకు మంగళవారం రాత్రి విశాఖపట్నానికి చెందిన ఆర్కెస్ట్రాను ఏర్పాటు చేశారు.

పూర్వజన్మసుకృతం



సిరిమానును అధిరోహించే అవకాశం దక్కడం పూర్వజన్మ సుకృతం. గతేడాది మా చిన్నాన్న జన్నిపేకాపు రామారావు సిరిమానును అధిరోహించగా, ఈ ఏడాది నాకు అవకాశం వచ్చింది. అమ్మవారి కరుణాకటాక్షాలు అందరిపైనా ఉండాలి.

– జన్నిపేకాపు భాస్కరరావు

తాత్కలిక మరుగుదొడ్ల ఏర్పాటు..

జాతరకు వచ్చిన భక్తులు కాలకృత్యాలను తీర్చుకునేందుకు వీలుగా గోముఖీనది ఒడ్డున 40 తాత్కాలిక మరుగుదొడ్లు, రెండు చోట్ల మహిళల వస్త్ర మార్పిడి గదులను ఏర్పాటుచేశారు. భక్తులు అమ్మవారి ఆలయానికి వెళ్లేందుకు, ఇతర ప్రాంతాల నుంచి గ్రామానికి భక్తులు చేరుకునేందుకు వీలుగా రూట్‌మ్యాప్‌లను ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేశారు.

చురుగ్గా పారిశుద్ధ్యపనులు

జాతరలో 120 మంది పారిశుద్ధ్య కార్మికులు విధుల్లో నిమగ్నమయ్యారు. డీఎల్‌పీఓ బి.సత్యనారాయణ పారిశుద్ధ్య పనులను ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. జాతర ప్రాంతంలోని వ్యర్థాలను కార్మికులు వెంటవెంటనే తొలగిస్తున్నారు.

నాలుగుచోట్ల కంట్రోల్‌రూమ్‌లు

గ్రామంలోని చదురుగుడి, వైఎస్సార్ విగ్రహం, వనంగుడి, జెడ్పీహెచ్ఎస్ వద్ద నాలుగు కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటుచేశారు. కంట్రోల్‌రూమ్‌లు వద్ద తహసీల్దార్ల పర్యవేక్షణ ఉంటుంది.

బస్సు సర్వీసులు ఇలా..

పార్వతీపురం, సాలూరు, విజయనగరం, శ్రీకాకుళం, ఎస్.కోట, పాలకొండ డిపోల నుంచి సుమారు 150 బస్సులను జాతర సందర్భంగా ఆర్టీసీ అధికారులు నడపనున్నారు. భక్తుల రద్దీని బట్టి అవసరమైతే అదనపు సర్వీసులను పెంచనున్నట్లు అధికారులు తెలిపారు.

ఐదు చోట్ల వైద్యశిబిరాలు



గ్రామంలోని వనంగుడి వద్ద, క్యూలైన్లు, అంగన్‌వాడీకేంద్రం, పీహెచ్‌సీ, రామమందిరం వద్ద వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. శిబిరాల్లో ఏడుగురు వైద్యాధికారులతో పాటు, సుమారు 50 మంది పారామెడికల్ సిబ్బంది విధులు నిర్వహించనున్నారు.

తాత్కాలిక బస్టాండ్‌లివి...



- సాలూరు ప్రాంతం నుంచి వచ్చిన బస్సులను వనంగుడివద్ద
- పార్వతీపురం, బొబ్బిలి వైపు నుంచి వచ్చిన బస్సులను జెడ్పీ హైస్కూల్ ఆవరణ నుంచి రాకపోకలు సాగించేందుకు ఏర్పాట్లు చేశారు. అలాగే అదే ప్రదేశం వద్ద టిక్కెట్ కౌంటర్లను ఏర్పాటుచేశారు.

జాతరకు వాహనాల్లో ఇలా చేరుకోవాలి...

శంబర గ్రామానికి భక్తులు ఐదు మార్గాల్లో చేరుకోవచ్చు.

- చినబోగిలి నుంచి మక్కువ మీదుగా శంబర
- బొబ్బిలి నుంచి కన్నంపేట, వయా మక్కువ మీదుగా శంబర
- సాలూరు నుంచి మామిడిపల్లి మీదుగా శంబర
- సాలూరు నుంచి మావుడి మీదుగా శంబరకు చేరుకోవచ్చు.
- మక్కువ నుంచి శంబరకు ఆర్టీసీ బస్సులు మినహా, ఇతర వాహనాలను చెముడు గ్రామం మీదుగా శంబర చేరుకునేందుకు చర్యలు చేపట్టారు.
- శంబరకు చేరుకునే వాహనాలకు ఐదుచోట్ల వాహన పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు.
- సాలూరు మండలం మామిడిపల్లి గ్రామం మీదుగా వచ్చే ద్విచక్రవాహనాలను వనంగుడి సమీపంలో ఉంచేందుకు పార్కింగ్ ఏర్పాటుచేశారు. నాలుగు చక్రాలు, మూడుచక్రాలు వాహనాలు వీఆర్ఎస్ ప్రాజెక్ట్ వద్ద పార్కింగ్ చేయాలి.
- మావుడి మీదుగా శంబర గ్రామానికి చేరుకునే వాహనాలను ఎస్సీ హాస్టల్ సమీపంలోను, మక్కువ నుండి శంబర చేరుకునే వాహనాలను జెడ్పీహైస్కూల్ వద్ద, చెముడు మీదుగా చేరుకునే వాహనాలను శంబర గోముఖినది ఒడ్డున ఉంచేందుకు పార్కింగ్ సదుపాయం కల్పించారు.


భక్తులు ఆలయానికి చేరుకునే మ్యాప్

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడిన నూకయ్య మృతదేహం రోదిస్తున్న కుటుంబసభ్యులు

కురుపాం: మండలంలోని గుమ్మ పంచాయతీ పరిధి గుమ్మగడబవలస గ్రామానికి చెందిన సీమల నూకయ్య(36) అలియాస్ సురేష్ సోమవారం ఉదయం గ్రామసమీపంలో మామిడిచెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనపై గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నూకయ్య ఎండీఎం వాహనం డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గుమ్మ రేషన్ డిపో పరిధిలో ఆర్థికపరమైన సమస్య తలెత్తడంతో తాను తప్పు చేయకపోయినప్పటికీ మాటలు పడడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఉరివేసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఎల్విన్‌పేట పోలీసులు మృతుడి గ్రామానికి వెళ్లి కుటుంబసభ్యుల నుంచి ఫిర్యాదు తీసుకుని కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించారు. మృతుడికి భార్య జ్యోతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

అలిగి వెళ్లిపోయిన యువతి అప్పగింత

గరుగుబిల్లి: మండలంలోని వల్లరగుడబ గ్రామానికి చెందిన మండ లక్ష్మి ఈనెల 18న అలిగి ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఈ మేరకు ఆమె తల్లి సరస్వతి ఈనెల 20న గరుగుబిల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో హెచ్‌సీ ఎన్. ఈశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. స్థానికులు, కుటుంబసభ్యుల సమాచారం మేరకు విశాఖపట్నంలో లక్ష్మి ఉన్నట్లు గుర్తించి, అక్కడి నుంచి ఆమెను సిబ్బంది సహాయంతో రప్పించారు. అనంతరం తల్లి సరస్వతికి సోమవారం అప్పగించారు. భర్తతో స్వల్ప మనస్పర్థల కారణంగా ఎవరికీ సమాచారం ఇవ్వకుండా వెళ్లిపోయిన యువతిని స్థానిక సచివాలయ మహిళా పోలీసు గొర్లి భవాని ఆధ్వర్యంలో పోలీసులు అప్పగించడంతో కుటుంబసభ్యులు, తల్లి సంతోషం వ్యక్తం చేసి కృతజ్ఞతలు తెలిపారు.